

నగరంలో భారీ వర్షం

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- రోడ్డుపై చేరిన మురికి నీరు
- కనిపించని ప్రమాదకర గుంతలు
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు



8

కేంద్రం నిధులు పక్కదారి

- కేంద్ర ప్రభుత్వ నిధులను పక్కదారి పట్టిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- నిధుల మళ్లింపు వల్లే ఆర్‌వోబీ పనుల ఆలస్యం
- పంట నష్టంపై పక్కాగా వివరాలు సేకరించాలి
- జిల్లా అభివృద్ధి సమన్వయ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ ధర్మపురి అర్వింద్

దిశ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్, చిత్రంలో అర్బన్ ఎమ్మెల్యే, కలెక్టర్



సుభాష్‌నగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తుందని నిధుల మళ్లింపు వల్లే ఆర్‌వోబీ పనులు ఆలస్యమవుతున్నాయని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం ఎంపీ అర్వింద్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో వివిధ శాఖల ద్వారా చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిపై సమావేశంలో చర్చించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలును సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులతో జిల్లాలో అమలవుతున్న వివిధ పథకాల వివరాలను పూర్తిస్థాయి గణంకాలతో పక్కాగా అందించాలని అధికారులను సూచించారు. అభివృద్ధి పనుల్లో ఎనలేని తాత్సారం జరుగుతుందని, అమృత్ పథకం కింద భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పనులు ఏళ్లతరబడి కొనసాగుతూనే ఉన్నాయని అన్నారు. ఈ పథకంపై దసరా సెలవుల అనంతరం ప్రత్యేకంగా సమీక్ష జరుపుతామని పూర్తి వివరాలతో సమావేశానికి సంబంధిత అధికారులు రావాలని ఆదేశించారు. మాక్లూర్ మండలం అడవి మామిడిపల్లి, మాధవనగర్ ఆర్‌వోబీ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారుల సంస్థ, తదితర శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న బ్రిడ్జిలు, కల్వర్టులు, అప్రోచ్ రోడ్‌ల నిర్మాణాలు యుద్ధప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలన్నారు. నిజామాబాద్-ఆర్మూర్ మార్గంలో అటవి భూమికి సంబంధించి వివాదాన్ని కేంద్రం దృష్టికి తెచ్చి పరిష్కరించామన్నారు. త్వరలోనే ఈ మార్గంలో రెండు

మిగతా 8వ పేజీలో...

నూతన హంగులతో రైల్వేస్టేషన్

- అదనంగా రెండు లైన్‌లు, రెండు ఫ్లాట్‌ఫామ్‌లు
- ఎంపీ అర్వింద్

8

జీఎస్టీ తగ్గింపు దసరా కానుక

- ఆర్‌వోబీల ఆలస్యంపై దసరా తర్వాత ఉద్యమం
- విలేకరుల సమావేశంలో ఎంపీ ధర్మపురి అర్వింద్

8



ధాన్యం కొనుగోళ్లకు సన్నాహాలు

ఏర్పాట్లలో అధికార యంత్రాంగం

- జిల్లా వ్యాప్తంగా 650 పైగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- దసరా మరుసటి రోజు నుంచి కేంద్రాల ప్రారంభం
- ఎనిమిది లక్షల మెట్రిక్ టన్నులకు పైగా కొనుగోళ్లకు ఏర్పాట్లు
- బ్యాంకు గ్యారంటీ ఉంటేనే మిల్లర్లకు ధాన్యం కేటాయింపు
- జిల్లాలో 4లక్షల37 వేలకు పైగా ఎకరాల్లో వరి సాగు విస్తీర్ణం
- ధాన్యం కొనుగోళ్లకు రెండు కోట్ల గన్ని బ్యాగుల అవసరం
- జిల్లాలో 303 రైస్ మిల్లులు
- 249 మిల్లులకు మాత్రమే ధాన్యం కేటాయించే అవకాశం
- నేడు కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు, ఐకేపీ, రైస్ మిల్లర్లతో కలెక్టర్ సమావేశం

నిజామాబాద్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వానాకాలం సీజన్‌కు గాను ధాన్యం కొనుగోళ్లకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు పౌరసరఫరాల సంస్థ కార్యాచరణను సిద్ధం చేస్తోంది. రెండేళ్లుగా రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లలో జిల్లా మొదటి స్థానంలో ఉండగా ఈసారి కూడా భారీగా ధాన్యం సేకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ గాను 8 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం వస్తుందని జిల్లా అధికారులు అంచనా వేస్తున్నారు ఇందుకు గాను 650 పైగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో సన్నరకం ధాన్యం ఎక్కువగా వేసినందున కొనుగోలు కేంద్రాలను సన్నారకాలకు, దొడ్డు రకాలకు వేర్వేరుగా ఏర్పాటు చేస్తున్నారు. దసరా మరుసటి రోజు నుంచి జిల్లాలో బోధన్, వర్ని, కోటగిరి ప్రాంతాలలో మొదటి విడత కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు ఏర్పాటు చేస్తుండగా బుధవారం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సహకార సొసైటీ కార్యదర్శులు, ఐకేపీ సెంటర్స్ నిర్వాహకులతో, రైస్ మిల్లర్ ప్రతినిధులకు ధాన్యం కొనుగోళ్లపై కలెక్టరేట్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఈసారి ధాన్యం కేటాయింపుల విషయంలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఖరీఫ్ ధాన్యాన్ని కొనుగోలు చేసే రైస్ మిల్లర్ నుంచి ముందుగానే బ్యాంక్ గ్యారంటీ తీసుకోనున్నారు. గన్ని బ్యాగులకు సంబంధించి మొదటి విడతకు సరిపడా గన్ని బ్యాగులు జిల్లాలో అందుబాటులో ఉన్నట్టు పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు.

నేడు కలెక్టర్ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం..

ఖరీఫ్ సీజన్‌లో పెద్దఎత్తున జిల్లాలో ధాన్యం సేకరించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. అక్టోబరు మూడో తేదీ నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనుంది. మొదట బోధన్, వర్ని, కోటగిరి మండలాలలో ధాన్యం వచ్చే అవకాశాలు ఉన్నందున అక్కడ మొదటి విడతగా 195 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లాలో రెండు కోట్ల గన్ని బ్యాగులు అవసరం ఉన్నాయి. అందులో కొత్తవి కోటి 10 లక్షలు అవసరం కాగా, మిగిలిన 90 లక్షలు పాత గన్ని బ్యాగులని వినియోగిస్తారు. ఇప్పటికే కొత్త గన్ని బ్యాగులు 60లక్షలు, పాత గన్ని బ్యాగులు 20 లక్షలకు పైగా జిల్లాలో అందుబాటులో ఉన్నట్టు జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. కాగా, బుధవారం కలెక్టర్ ఆధ్వర్యంలో సహకార సంఘాల సొసైటీ కార్యదర్శులకు, ఐకేపీ సెంటర్ నిర్వాహకులకు, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులకు ధాన్యం కొనుగోళ్లపై కలెక్టరేట్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నారు.

గ్యారంటీ ఇస్తేనే కేటాయింపులు..

ఈసారి ధాన్యం కేటాయింపుల్లో పౌరసరఫరాల శాఖ కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇదివరకు జిల్లాలో ధాన్యం కేటాయింపులు చేసుకొని సీఎంఆర్ చెల్లించని మిల్లులు బకాయిలుగా ఉన్న సంగతి తెలిసిందే ఈ విషయంలో గతంలో పనిచేసిన పౌరసరఫరాల శాఖ అధికారితో పాటు పౌరసరఫరాల సంస్థ అధికారులు సస్పెండ్ అయిన ఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా రైస్ మిల్లర్ నుంచి బ్యాంకు గ్యారంటీలను తీసుకుంటున్నారు. జిల్లాలో 303 రైస్ మిల్లులు ఉండగా ఇదివరకే 51 రైస్ మిల్లులను డిఫాల్ట్ రైస్ మిల్లులుగా గుర్తించారు. 249రైస్ మిల్లులకు మాత్రమే ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కేటాయించనున్నారు ఈ మేరకు వారి నుంచి అండర్ టేకింగ్ బ్యాంకు గ్యారంటీలు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు.

రికార్డు స్థాయిలో ధాన్యం వచ్చే అవకాశం

గత ఏడాది యాసంగి, వానాకాలం సీజన్‌లో జిల్లా రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఈ వానాకాలం సీజన్‌లో కూడా రికార్డు స్థాయిలో కొనుగోలుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో వర్షాలు సమృద్ధిగా కురవడంతో జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో 4లక్షల 37 వేలకు పైగా ఎకరాలల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో జిల్లాలో సన్నరకం ధాన్యాన్ని అధికంగా పండిస్తున్నారు. కాగా, 8లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని జిల్లా అధికారులు అంచనా వేస్తున్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న పోలీసు కమిషనర్ సాయిచైతన్య

ఎంపిక చేసిన కేసులను పకడ్బందీగా పరిశోధించాలి

- బాధితులకు న్యాయం జరిగేలా చొరవ చూపాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో పోలీసు కమిషనర్ సాయిచైతన్య

సుభాష్‌నగర్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో హెడ్‌కానిస్టేబుల్, ఏఎస్సైలు కొన్ని కేసులలో పరిశోధనలు చేయాలని పోలీస్ కమిషనర్ సాయిచైతన్య సూచించారు. జిల్లాలోని హెడ్‌కానిస్టేబుల్, ఏఎస్సైలతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎంపిక చేసిన కేసులలో ఏఎస్సైలు, ఎస్సైలు పకడ్బందీగా పరిశోధనలు చేయాలన్నారు. ఏఏ కేసుల్లో పరిశోధనలు చేయాలనేది వివరించారు. ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సందేహాలను నివృత్తి చేశారు. 89 రకాల మిస్సింగ్ కేసులు, సహజ మరణాల కేసుల విచారణ ఏ విధంగా పరిశోధన చేయడం ద్వారా ప్రజలకు సత్వర న్యాయం జరుగుతుందో తెలిపారు. ఎస్సైలకు, ఇన్స్‌పెక్టర్లకు ఇతర ముఖ్యమైన కేసుల పరిశోధనలు ఉండటంతో సమయం దొరకకపోవచ్చన్నారు. హెడ్‌కానిస్టేబుల్, ఏఎస్సైలు సక్రమంగా పరిశోధన చేసి బాధితులకు న్యాయం జరగడంలో చొరవ చూపాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు డీసీపీ బస్వారెడ్డి, సీసీఆర్‌బీ ఇన్స్‌పెక్టర్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి భారీ వరద

- 2 లక్షల 22 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ప్రాజెక్టు 40 వరద గేట్ల ద్వారా నీటి విడుదల



దిగువకు విడుదల అవుతున్న నీరు

మెండోర, సెప్టెంబరు, 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు ఎస్సారెస్పీలోకి 2 లక్షల 22 వేల క్యూసెక్కుల వరద చేరుతోందని ప్రాజెక్టు ఈఈ చక్రపాణి తెలిపారు. దీంతో వరద గేట్లు, ప్రధాన కాలువల ద్వారా 3 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రాజెక్టు 40 గేట్లను ఎత్తి గోదావరిలోకి 2 లక్షల 84 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి వరద కాలువ ద్వారా 6700 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 5500 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా గోదావరి లోకి 2500 క్యూసెక్కుల, సరస్వతి కాలువకు 400 క్యూ సెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కుల, అలీసాగర్ 180 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 709 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోకి ప్రస్తుత నీటి మట్టం 1088 అడుగుల 70 టీఎంసీల నీటి నిల్వ ఉందని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారులు తెలిపారు.



దసరా కిక్కు.. లేనట్టేనా..?

పండుగకు ముక్కా, సుక్కా అమ్మకాలు బంద్

- గాంధీ జయంతి నాడే దసరా
- మద్యం, మాంసం విక్రయాలకు అనుమతి లేదు
- ప్రభుత్వ ఖాజానాకు భారీగా గండిపడే అవకాశం
- గత దసరా సమయంలో 4లక్షల కేసుల లిక్కర్ సీసాలు, 2లక్షల కేసుల బీర్ల అమ్మకాలు
- జిల్లాకు గత ఏడాది దసరాకు రూ.60 కోట్ల ఆదాయం

బోధన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో వివిధ శుభకార్యాలు, పండుగలు, ఫంక్షన్లు ఏదైనా మాంసం, మద్యం లేనిదే కిక్కు ఉండదు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో ఇది ఓ ఆనవాయితీగా వస్తోంది. ఇక దసరా అంటేనే ఓ కిక్కు. ఏ పండుగకి లేనంతగా దసరాకు అంత జోష్ ఉంటుంది. ఇదే రోజు చుక్క... ముక్క ఉండాల్సిందే. పల్లె, పట్టణం అని తేడా లేకుండా మద్యం వినియోగం ఉంటుంది. కుటుంబ సభ్యులంతా మద్యం మత్తును... గమ్మత్తుగా ఎంజాయ్ చేస్తుంటారు. మద్యంతో పాటు మటన్, చికెన్, ఫిష్ ఉండాల్సిందే. అయితే ఈసారి దసరాకు ముక్క, చుక్కపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఒకే రోజు గాంధీ జయంతి.. దసరా

అక్టోబరు 2న గాంధీ జయంతి రోజు నాడే దసరా పండగ కూడా వస్తోంది. ఈ నేపథ్యంలో మద్యం, మాంసం విక్రయాలపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. సాధారణంగా గాంధీ జయంతి రోజున మద్యం, మాంసం దుకాణాలు మూసి వేయడం ఆనవాయితీ. అయితే అన్ని పండుగల మాదిరిగా దసరా ఉండదు. ఆ రోజున చాలామందికి చుక్క లేనిదే ముద్ద తిగదు. అందుకోసం అక్టోబరు 2న మద్యం, మాంసం విక్రయాలపై తర్జన భర్జన పడుతున్నారు.

మాంసానికి మస్తు గిరాకీ..

దసరాకి మాంసాహారులైన ప్రతి ఇంట్లో ముక్క ఉండాల్సిందే. గొర్రెలు, మేకలు, పొటే ళ్లు, మేక పోతులను కోసి వాటాలు చేయాల్సిందే. నాటు కోళ్లు, పారం కోళ్లు, చేపలు, రొయ్యలకు సైతం మస్తు గిరాకీ ఉంటోంది. ఇలా ప్రతి ఒక్కరూ పండుగ జరుపుకొంటారు. గ్రామాలు, పట్టణాలలోని వ్యాపారస్థులు, దుకాణదారులు పెద్ద పెద్ద వాహనాల యజమానులు దసరా పండుగ సందర్భంగా వారి దుకాణాలు, పరిశ్రమలు వాహనాల ముందు మేకలు, గొర్రెలను బలి ఇవ్వడం ఆనవాయితీ. ఇందుకోసం పొరుగు

మిగతా 8వ పేజీలో...

రోజూ రూ.4కోట్లకు పైగా అమ్మకాలు

జిల్లాలో ప్రతి రోజూ రూ.4కోట్లకు పైగా లిక్కర్ అమ్మకాలు జరుగుతాయి. నెలకు రూ.120 కోట్లకు పైగా అమ్మకాలు జరిగి భారీగా ఆదాయం సమకూరుతోంది. గతేడాది దసరా సమయంలో 4లక్షల కేసుల లిక్కర్ సీసాలు, 2లక్షల కేసుల బీర్లు అమ్ముడయ్యాయి. అయితే ఈ సారి దసరా, గాంధీ జయంతి ఒకే రోజు రావడం మద్యం దుకాణాలను మూసివేస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు ప్రకటించడంతో మద్యం అమ్మకాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్ర ఖజానాకు భారీ గండి పడే అవకాశం లేకపోలేదు.

మాసం విక్రయాలకు అనుమతి ఇవ్వాలి..

: మహేష్, మటన్ వ్యాపారి, బోధన్



ప్రతి సంవత్సరం దసరా పండుగ రోజు మటన్, చికెన్ షాపుల్లో గిరాకీ బాగా ఉంటుంది. దసరా పండుగ రోజు మాంసం విక్రయాలు జరగకపోతే మేము ఆర్థికంగా నష్టపోతాం. సంబంధిత అధికారులు స్పందించి దసరా రోజు మాంసం అమ్మకాలకు అనుమతులు ఇవ్వాలి. అనుమతి లేనిదే మాంసం విక్రయాలు జరపలేం.

మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు..

: జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి మల్లారెడ్డి



దసరా, గాంధీ జయంతి ఒకేసారి రావడంతో వైన్స్, బార్ షాపులు ప్రభుత్వ ఆదేశాల మేరకు బంద్ ఉంటాయి. బెల్ట్ షాపుల నిర్వాహకులు ఇతర షాపుల్లో మద్యం విక్రయాలు జరిపినట్లయితే కఠిన చర్యలు చేపడతాం. ఎక్సైజ్ సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి మద్యం అమ్మకాలు జరగకుండా చూడాలి.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

అమ్మ ఆదర్శ కమిటీల పనులను సత్వరమే పూర్తి చేయాలి

- యుద్ధప్రాతిపదికన మౌలిక వసతులను కల్పించాలి
- సమీక్షలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

సుభాష్‌నగర్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): అమ్మఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ఆయా ప్రభుత్వ బడులలో కొనసాగుతున్న పనులను సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు పెంపొందించేందుకు వీలుగా చేపట్టిన పనుల ప్రగతిపై కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మౌలిక వసతుల మెరుగు కోసం జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా రూ.42కోట్ల విలువ చేసే పనులను మంజూరు చేయగా, 23 కోట్ల విలువ గల పనులు జరిగాయని కలెక్టర్ తెలిపారు. నిధులు అందుబాటులో ఉన్నందున పట్టణ ప్రాంతాల్లోని బడులలో అవసరమైన చోట యుద్ధప్రాతిపదికన టాయిలెట్స్, తాగు నీరు, విద్యుత్ వసతి వంటి పనులను చేపట్టాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మంజూరీ లభించిన పనుల వివరాలను సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, తెలియజేయాలని ఎంఈవోలను ఆదేశించారు. కాగా, ప్రతి పాఠశాలలో విద్యార్థుల ఆపార్ ఐడీ తప్పనిసరి జనరేట్ చేయాలని కలెక్టర్ సూచించారు. ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాల కోసం అర్హులైన వారందరూ విరివిగా దరఖాస్తు చేసుకునేలా చొరవ చూపాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, డీఆర్డీవో సాయాగౌడ్, డీఈవో అశోక్, హౌసింగ్ పీడీ పవన్ కుమార్, వివిధ శాఖల ఇంజినీరింగ్ విభాగం అధికారులు, వివిధ మండలాల ఎంఈవోలు, ఐకేపీ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యంలో ప్రథమ స్థానంలో ఉండాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

8

గోడ కూలి తండ్రి, కూతురు దుర్మరణం

- భార్యకు తీవ్ర గాయాలు
- కోటగిరిలో విషాదం

6



మహేష్ (ఫైల్)

శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం

- పెచ్చులూడుతున్న స్లాబ్,
- భయాందోళనలో అధికారులు
- వర్షపు నీటికి బకెట్ల ఏర్పాటు

7



యాదిలో..

కొత్త కోడలికి వెండి బంగారం ఇచ్చే సంప్రదాయం



బతుకమ్మ తొమ్మిదిరోజుల ఉత్సవంలో కొత్తగా పెళ్లైన కోడలికి వెండి బంగారంతో పాటు నాలుగు రకాల బతుకమ్మలను తయారు చేసి అందించే సాంప్రదాయం ఉంది. బతుకమ్మ వేడుకల్లో పాలుపంచుకోవడంతో పాటు కొత్త కోడలికి బట్టలు, ఆభరణాలు అందించడం ప్రత్యేకత. చిన్నప్పుడు బతుకమ్మ వేడుకలకు చిన్న గుంటను ఏర్పాటు చేసి అందులో నీళ్లను నింపి బతుకమ్మను ఆడేవాళ్లం.వేడుకల్లో కోలాటాలు, బతుకమ్మ ఆటలతో సాంప్రదాయంగా పూజించేవాళ్లం.

వి.ప్రభాదేవి, విజయ్ హైస్కూల్ కరస్పాండెంట్

తొమ్మిది రోజులు మహిళలు పూజించే వేడుక



తెలంగాణ సంస్కృతి సంప్రదాయానికి ప్రతీక అయిన బతుకమ్మను తొమ్మిది రోజుల పాటు మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. అడవిలో దొరికే తంగేడె పువ్వు, గునుక పువ్వులు వంటి వాటితో బతుకమ్మ తయారు చేసి అందులో గౌరీ దేవతను పూజించడం స్త్రీతత్వ శక్తిని తెలియజేస్తుంది. నాటి కాలం నుంచి ప్రకృతిని ఆరాధించే పండుగ బతుకమ్మ. పూలు, చెట్లను ఆరాధించడం సంస్కృతిలో ముఖ్యంగా భావిస్తారు.

- రాధిక, ఫారెస్ట్ రేంజ్ అధికారిణి

ప్రకృతితో సహజీవనం బతుకమ్మ



ప్రకృతితో సహజీవనం ఆరాధించడం బతుకమ్మ వేడుకల్లో ముఖ్యమైనది ఊరువాడ సమాజ జీవత్వంతో ఐక్యమత్యంతో ఆనందోత్సహాలతో జరుపుకునే పండుగ. భావితరాల వారికి ప్రకృతితో మమేకమై జీవించమని బాంధవ్యాలను కలుపుకుంటూ ముందుకు సాగమని సందేశాన్ని ఇచ్చేటటువంటి వేడుక బతుకమ్మ. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి అందులో గౌరమ్మను పూజించడం ఆడపడుచులందరూ ప్రకృతి ఆరాధన చేసుకునే పండుగ బతుకమ్మ.

-సుధ, రచయిత



బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ సంబరాలలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

రుద్రూరు,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఫుడ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మంగళవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను తయారు చేసి ఆటలు ఆడుతూ పాటలు పాడారు. అనంతరం బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేశారు.

క్రైం సమాచారం

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

బాన్సువాడ రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని సోమేశ్వర్ గ్రామశివారులోని నల్లపోచమ్మ వెంచర్‌లో నూతనంగా నిర్మిస్తున్నఇంటిలో ప్రమాదవశాత్తు మంగళవారం విద్యుదాఘాతంతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్లితే మృతుడు మహమ్మద్ పాషా అనే వ్యక్తి నూతన ఇంట్లో టైల్స్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి స్పృహ తప్పి పడిపోయాడు. తోటికార్మికులు గమనించి బాన్సువాడ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి సోదరుడు ఇలియాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతులకు నష్టపరిహారం అందజేత

ఆర్మూర్ టౌన్, సెప్టెంబరు, 23(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో విద్యుత్ అధికారులు పాడి పశువులు చనిపోయిన రైతులకు నష్టపరిహారం కింద రూ. లక్ష 20వేలు అందజేశారు. గత సంవత్సరం మామిడిపల్లికి చెందిన మల్యాల పెద్ద బోజన్న, ఆకుల రాజేశ్వర్‌లకు చెందిన మూడు గేదెలు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతిచెందడంతో పాడి రైతులు విద్యుత్ అధికారులకు విన్నవించగా మంగళవారం విద్యుత్‌శాఖ ద్వారా వచ్చిన రూ. లక్ష 20వేలు అధికారులు రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ డీఈ రాజేశ్వర్‌రావు, ఏడీఏ శ్రీనివాస్, ఏఈ మౌనిక రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఆకుల రాము, తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో నిందితుడికి ఏడాది జైలు

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు, 23(ఆంధ్రజ్యోతి): దొంగతనం చేసి పట్టుబడిన నిందితుడు నూనె కిరణ్ కు ఆర్మూర్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి సరళరాణి యేడాది జైలు శిక్ష విధించినట్లు ఎస్సై ఎండి మాలిక్ రహ్మాన్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తొర్లికొండలో గత మార్చి నెల 27న గడ్డం భూమేశ్వర్ ఇంట్లో రాత్రి ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న నగదును, వంట సామాన్‌లను నిందితుడు నూనె కిరణ్ దొంగతనం చేసి పట్టుబడ్డాడని మంగళవారం ఈ కేసులో నిందితుడైన నూనె కిరణ్‌కు ఆర్మూర్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి సరళరాణి ఏడాది జైలు శిక్ష విధించారని ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో ఒకరి మృతి

పాల్వంచ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు గుండెపోటుతో గ్రామానికి చెందిన రాములు(49) మంగళవారం మరణించారు. గ్రామస్థులు, కుటుంబసభ్యుల కథనం మేరకు రాములు కాలక్షేపం నిమిత్తం ప్రతిరోజు ఎంపీడీవో, గ్రామపంచాయతీ కార్యాలయానికి వచ్చే వాడని అన్నారు. ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన రాములుకు బీపీ పెరిగి గుండెపోటుతో మృతిచెందాడని తెలిపారు. మృతుడికి భార్య కుమారుడు ఉన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు..

బోధన్,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని ఏరాజ్‌పల్లి గ్రామానికి చెందిన మల్లారం సాయిలు అనే వ్యక్తి ఆదివారం ఉదయం తన స్కూటీ వాహనంపై కాలకృత్యాలకు వెళ్తున్నానని భార్య ప్రమీలతో చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడని తిరిగి రాకపోవడంతో భార్య ప్రమీల ఫిర్యాదు చేసిందని రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం గ్రామంలోని చెరువు కట్ట వద్ద మృతదేహం కనిపించిందన్నారు. మంగళవారం ఉదయం మల్లారం సాయిలు మృతదేహాన్ని నీటి నుంచి బయటకు తీయడం జరిగిందని ఎస్సై తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామన్నారు. తన భర్త సాయిలు కాలకృత్యాలు తీర్చుకోవడానికి చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడిపోయి ఈత రాక అందులో మునిగి పోయ్యాడని మృతుడి భార్య ఫిర్యాదులో పేర్కొందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

నవీపేట,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంగిని శివారులో ఈ నెల 21న సాయంత్రం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయని ఎస్సై తిరుపతి తెలిపారు. నాళేశ్వర్‌కు చెందిన ఓరుగంటి భూమయ్య, కాలగడ్డ నడిపి గంగాధర్‌లు పని నిమిత్తం నవీపేటకు బైక్‌పై వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా మరో బైక్‌పై తోట రాజు వస్తున్నాడని తుంగిని సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో గంగాధర్, రాజులకు గాయాలయ్యాయని ఎస్సై తెలిపారు. బాధితుడు భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బోధన్‌లో వీధి కుక్కల స్వైర విహారం

● ఇద్దరు చిన్నారులపై దాడి

బోధన్,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి):బోధన్ పట్టణంలో వీధికుక్కలు రోజురోజుకు స్వైర విహారం చేస్తున్నాయి. మంగళవారం ఉదయం బోధన్ పట్టణంలోని 19వ వార్డులో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ ఇద్దరు చిన్నారులను గాయపర్చాయి. వార్డులోని మూడేళ్ల అనూష అనే బాలికతో పాటు రెండేళ్ల షేక్ ఉమర్‌ను కరిచాయి., వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులతో పాటు వార్డు వాసులు మాట్లాడుతూ వీధి కుక్కల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. నిత్యం వీధి కుక్కలు స్వైర విహారం చేయడంతో పట్టణంలో ఏదో ఒక వార్డులో కుక్కలు గాయపరుస్తూనే ఉన్నాయి. ఇకనైన సంబంధిత అధికారులు స్పందించి వాటిని నియంత్రించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నవీపేటలో ఒకరి అదృశ్యం

నవీపేట,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన నందిపేట కృష్ణ అనే 33 సంవత్సరాల వ్యక్తి అదృశ్యమయ్యాడని ఎస్సైతిరుపతి తెలిపారు.కూలి పని చేసుకుని జీవించేకృష్ణఈనెల 19న పని నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదని అన్నారు.భార్య రుచిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



కృష్ణ(ఫైల్)

గోడ కూలి తండ్రి, కూతురు దుర్మరణం

● భార్యకు తీవ్ర గాయాలు ● కోటగిరిలో విషాదం



మహేష్, చిన్నారి మృతదేహం

కోటగిరి,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న ఓ దంపతులకు నెల రోజుల క్రితం పుట్టిన చిన్నారిని అల్లారుముద్దుగా చూసుకుంటున్న ఆ కుటుంబాన్ని గోడ రూపంలో మృత్యువు కబళించింది. నిద్రిస్తున్న చోట పక్కనే ఉన్న రైస్‌మిల్ పురాతన గోడ ఇంటిపై కూలడంతో నిద్రిస్తున్న చోటు తండ్రి, కూతురు మృతి చెందగా భార్యకు తీవ్ర గాయాలైన సంఘటన నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మహేష్(24)తో పాటు అతని నెలన్నర కూతురు గోడకూలి మృత్యువాత పడ్డారు. భార్య మహేశ్వరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం ఇందూర్ మహేష్ రెండేళ్ల క్రితం గ్రామానికి చెందిన మహేశ్వరిని పెళ్లి చేసుకున్నాడు. వీరికి నెలన్నర రోజుల క్రితం కూతురు జన్మించింది. మహేష్ కుటుంబం పాత ఇంట్లో నివసిస్తున్నారు. వీరి ఇంటిని అనుకోని మూతబడిన పాత రైస్‌మిల్ ఉంది. రైస్‌మిల్ వాడుకలో లేకపోవడంతో భారీ వర్షాలకు గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. ఎత్తైన గోడలు కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని కుటుంబ సభ్యులు గమనించలేదు. రోజువారిగా తన పాత ఇంట్లో చిన్నారితో కలిసి నిద్రిస్తుండగా మంగళశారం తెల్లవారుజామున గోడ కూలి వీరి ఇంటిపై పడింది. శబ్దం విన్న కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పాత ఇంటిపై ఇటుకలతో కూడిన గోడ కూలడంతో మహేష్, అతని భార్య మహేశ్వరి చిన్నారి శిథిలాల కింద చిక్కుకున్నారు. ఇంటి వెనుక భాగం ఇరుకుగా ఉండటంతో సహాయక చర్యలకు ఇబ్బంది ఎదురైంది. స్థానికులు అతి కష్టం మీద మట్టి గోడలను తొలగించే ప్రయత్నం చేశారు. అప్పటికే మహేష్‌తో పాటు నెలన్నర పాపమృతి చెందారు. భార్య మహేశ్వరికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. కళ్లముందే తమ కొడుకు, మనువరాలు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈఘటన పలువురిని కలిచి వేసింది. సంఘటన స్థలానికి పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు చేరుకుని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైస్‌మిల్‌ను తొలగించాలని కోరినా పట్టించుకోలేదు

నివాసాల మధ్య ఉన్న రైస్‌మిల్‌ను తొలగించాలని ఎన్నిసార్లు రైస్‌మిల్ యాజమానిని కోరిన పట్టించుకోలేదని స్థానికులు తెలిపారు. గత 30 సంవత్సరాలుగా రైస్‌మిల్ వృథాగా పడి ఉంది. నిర్వహణ లేకపోవడంతో గోడలు శిథిలావస్థకు చేరాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గోడలు తడిసి ప్రమాదకరంగా మారాయి. ఎత్తైన గోడలు ఇంటిపై కూలడంతో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. రైస్‌మిల్ ఐదుగురు అన్నదమ్ముల ధ్య ఉండటంతో స్థల వివాదం నెలకొంది. యాజమానులు పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరి ఇద్దరు ప్రాణాలను బలితీసుకుంది. రైస్‌మిల్ యాజమానులపై చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

ఇద్దరు మృతి చెందడంపై విచారం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే పోచారం

కోటగిరి మండల కేంద్రంలోని రైస్‌మిల్ గోడకూలి ఇద్దరు మృతి చెందడంపై ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. శిథిలావస్థకు చేరిన ఇళ్ల పక్కన ఎవరు ఉండకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

మృతుల కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

కోటగిరి మండల కేంద్రంలో ఓ ఇంటిపై పాత రైస్‌మిల్ గోడ కూలి మృతి చెందిన ఇందూర్ మహేష్, నెలన్నర పాపా కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియాలని చెల్లించాలని సీపీఐ, సీపీఎం పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. గోడ కూలి ధ్వంసమైన ఇంటిని మంగళవారం సీపీఐ, సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైస్‌మిల్ శిథిలావస్థకు చేరిన యాజమాని దానిని ధ్వంసం చేయకపోవడంతో రెండు నిండు ప్రాణాలు పోయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాల నేపథ్యంలో పాత ఇళ్లు, భవనాలను గుర్తించి ధ్వంసం చేయాలని డిమాండ్ చేశారు. సంఘటన స్థలాన్ని ఎమ్మెల్యే పోచారంతో పాటు జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు విఠల్ గౌడ్, నన్నేసాబ్, గంగాధర్, దత్తు, పోశెట్టి, ముఖేష్ తదితరులున్నారు.

బ్రహ్మచారిణిగా దర్శనమిచ్చిన దుర్గాదేవి

● రెండవ రోజు అమ్మవారికి ఘనంగా పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అమ్మనుగన్న అమ్మ అంటూ భక్తులు దుర్గాదేవిని బ్రహ్మచారిణి రూపంలో పూజించారు. దేవిశరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రెండో రోజున అమ్మవారిని బాలత్రిపురసుందరి రూపంలో అలంకరించారు. ఆలయాల్లో కొలువుదీరిన అమ్మవారు మొదలుకొని మండపాల్లో నెలకొల్పిన దుర్గాదేవి అమ్మవారిని బాలత్రిపుర సుందరిగా భక్తులు ఆరాదించారు. కుడిచేతియందు జపమాలను, ఎడమచేతి యందు కమండలం ధరించును. పరమేశ్వరుని పత్నిగా అవుటకు తీవ్రమైనటువంటి తపస్సును ఆచరించిన తల్లి. ఈ తల్లిని పూజించిన సర్వ సిద్ధి, విజయప్రాప్తి కలుగును. వేడుకుంటూ అమ్మవారికి తీపి బూంది, శనగలు నైవేద్యంగా సమర్పించుకున్నారు.

నేడు చంద్రఘంట (గాయత్రీమాత)

దేవిశరన్నవరాత్రి ఉత స్వాలలో భాగంగా దుర్గా అమ్మ భక్తులకు గాయత్రిదేవి రూపంలో దర్శనమివ్వనున్నారు. పది చేతుల్లో ఖడ్గం, బాణం మొదలగు అస్త్రములను ధరించినది. భయం, బాధల నుంచి విముక్తి కలించునది. ప్రసాదంః రవ్వకేసరి, పులిహోర.

కమ్మర్‌పల్లి: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను పురష్కరించుకుని మండంలోని కోనాపూర్ జైభవాని దుర్గామాతా ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో కొలువుదీరిన దుర్గామాత మంగళవారం రెండవరోజు లక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ముప్కాల్:శరన్నవరాత్రిఉత్సవాల్లో బాగంగా రెండవ రోజు వేదాలకు ప్రతీరూపం అయిన గాయత్రి దేవిగా మంగళవారం దుర్గా మాత పూజలందుకుంది.

బోధన్: బోధన్‌లోని కల్దుర్కి గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సారి నవరాత్రుల్లో భాగంగా అమ్మవారితో పాటు తొమ్మిది రూపాల్లో ఉన్న అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించారు.

నవీపేట: శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలలో భాగంగా 2వ రోజైన మంగళవారం దుర్గామాతకు పూజలు నిర్వహించారు.

వేల్పూర్: వేల్పూర్ మండల కేంద్రంలోని బీసీ కాలనీలో దేవి ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో రెండవ రోజు యజ్ఞహోమాల కార్యక్ర మాలను భక్తి శ్రద్దలతో నిర్వహించారు.

జక్రాన్‌పల్లి:గ్రామాలలో దుర్గాదేవి ఉత్సవాలను భక్తులు, మండపాల సభ్యులు, ప్రజలు భక్తి శ్రద్దలతో ఘనంగా జరు పుకుంటున్నారు.

జాడిలో వరిపంట పరిశీలన

సాలూర,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి):సాలూర మండలం జాడి జమాల్‌పూర్ గ్రామ శివారులోని వరిపంటను మంగళవారం సాలూర ఏవో శ్వేత వరిపంటను పరిశీలించారు. వాతావరణ పరిస్థితులు, వర్షభావ పరిస్థితి వలన పంటలకు పలు రకాల రోగాలు సోకుతున్న నేపథ్యంలో వ్యవసాయ అధికారులు అప్రమత్తమవుతూ నిత్యం పంటల పరిశీలనను చేపడుతున్నారు. వరి పంటకు మేడ విరుపు వ్యాధి లక్షణాలు ఉన్నట్లు వ్యవసాయ అధికారిని వెల్లడించారు. ఈ వ్యాధి నుంచి పంటను కాపాడుకోవాలంటే పీకార్సిస్ట్రోబిన్ మరియు ట్రీసైక్లజోలే అనే మందును ఎకరాకు 400 ఎంఎల్ పిచికారి చేసినట్లయితే మేడ విరుపు వ్యాధి భారీ నుండి పంటలను కాపాడుకోవచ్చని వ్యవసాయ అధికారి రైతులకు సూచించారు. పంటలకు ఎలాంటి వ్యాధులు సోకిన పరిధి వ్యవసాయ అధికారిని సంప్రదించి పరిశీలన చేయించి అధికారి సూచనలు, సలహాల మేరకు జాగ్రత్తలను తీసుకోవాలని రైతులను అధికారి కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు ఉన్నారు.

ఫెన్సింగ్‌లో భారత జట్టుకు విద్యార్థిని ఎంపిక

ముప్కాల్ , సెప్టెంబరు, 23(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలంలోని కిసాన్ నగర్ సెయింట్ ఎలిజబెత్ పాఠశాల విద్యార్థిని శివాని జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఫెన్సింగ్ పోటీలలో భారతి జటుకు ఎంపికైందని పాఠశాల హెచ్ఎం సిస్టర్ సుందరి తెలిపారు. ఇటీవల ఉత్తరాఖండ్‌లో జరిగిన జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి భారత జట్టుకు ఎంపికైందన్నారు. ఎంపికైన విద్యార్థినిని పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ మేరి, ఇంచార్జి సిస్టర్ సురేఖ, వ్యాయమ ఉపాధ్యాయులు శ్రీకాంత్, కవిత అభినందించారు.

మొక్కజొన్న, సోయాబీన్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

ముప్కాల్,సెప్టెంబరు, 23(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న, సోయాబిన్ కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని కోరుతూ ముప్కాల్ మండల బీజేపీ నాయకులు మంగళవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పంట నష్టం జరుగుతుందని కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో ధరలు తగ్గాయని వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రధాని మన్‌కీబాత్ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న స్టేట్ కౌన్సిల్ నాయకుడు

మోర్తాడ్ ,సెప్టెంబరు, 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం మండల కార్యకర్తల సమావేశం నిర్వ హించారు. సమావే శానికి బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యులు యోగేశ్వరన ర్సయ్య ముఖ్య అతిథిగా హాజర య్యారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 28న ఆదివారం మండల కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ గారి మాన్‌కిబాత్ జరుగ నుందని తెలిపారు. అన్ని గ్రామా ల నుంచి పెద్ద ఎత్తున్న రైతులు పా ల్గొని మన్‌కీబాత్ కార్యక్రమా న్ని విజయవంతం అయ్యేలా బీజేపీ శ్రేణు లు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్య క్షుడు శివానంద్, పుప్పాల నరేష్, లక్ష్మీపటేల్, ఏలేటి సాయన్న, వెంచి ర్యాల గంగారెడ్డి, సంతోష్ , అశోక్, చిన్నారెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలి

కోటగిరి,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్ రూమ్ బిల్లుల చెల్లింపుల్లో అవినీతి, అక్రమాలు జరిగాయంటూ అఖిల పక్షం నాయకులు ఆరోపణలు చేయడం తగదని కోటగిరి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్ పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రెండు రోజుల క్రితం అఖిల పక్షం నాయకులు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణంలో అవినీతి, అక్రమాలు జరిగాయంటూ ధర్నా చేయడంతో పాటు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇవ్వడం సరికాదన్నారు. గత ప్రభుత్వ హయంలో 430 ఇళ్ల కోటగిరిలో నిర్మించామన్నారు. ప్రభుత్వం మారడంతో బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగిన మాట వాస్తమేనని అన్నారు. సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కొందరు తమ రాజకీయ ప్రయోజనాల కోసం అవినీతి ఆరోపణలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విండో అధ్యక్షులు కూచి సిద్దు, నాయకులు శ్రీధర్, సంతోష్, హొగిర్ రావు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమ్‌గల్,సెప్టెంబరు, 23(ఆంధ్రజ్యోతి): స్వస్త్ నారి స్వశక్తి పరివార్ అభియాన్ పథకంలో భాగంగా పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి బిఎంఈ డాక్టర్ బృందం హాజరయ్యారు. ఈ శిబిరానికి వచ్చిన ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలను, మందులను ఉచితంగా అంద జేశారు. ఈ శిబిరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అజయ్ పవర్, డాక్టర్ బృందం ఆశాజ్యోతి, మనోజ్‌సాయి, భార్గవి, కీర్తన, విజయ్, అన్వేష్, సాగర్, ఆదిల్, అనిల్, ఇయాన్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వేల్పూర్:వేల్పూర్ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం స్పెషలిస్టువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మహిళల కు మాత్రమే వైద్య పరీక్షలు చేసుకునేందుకు అవకాశం ఇవ్వడం జరిగిందని డాక్టర్ వీణ తెలిపారు. అనంతరం గైనకాలజీస్టు గీత, ఆర్థోపేటిక్ డాక్టర్ శ్రీకాంత్, కంటి వైద్యులు భుజంగరెడ్డి వంటి స్పెషలిస్టుల ద్వారా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేయడం జరి గిందని డాక్టర్ వీణ తెలిపారు. ఈ కార్యక్రమం లో సూపర్ వైజర్లు, ల్యాబ్ టెక్నిషియన్‌లు, ఆశవర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:మండల కేంద్రంలోని ప్రభు త్వ ఆసు టపత్రిలో బుధవారం స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ నర్సింహస్వామి తెలిపారు. శిబిరంలో దంత వైద్య నిపుణులు, గైనాకాలజిస్టు, మెడికల్ స్పెషలిస్టు,చెవి, కంటి, చర్మవైద్య నిపుణులు పాల్గొనున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలి

▸▸ ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి



పిప్రిలో సైన్స్ ల్యాబ్ ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆర్మూర్,సెప్టెంబరు, 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆర్మూర్ఎమ్మెల్యేపైడి రాకేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆర్మూర్ మండలం పిప్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ. 13లక్షలతో నిర్మించిన సైన్స్ ల్యాబ్ ను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునేది పేద పిల్లలేనని వారికి నాణ్యమైన విద్యను అందించి ప్రయో జకులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయుల పైనే ఉందన్నారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు.పాఠశాలల్లో సమస్యలను దశలవారిగా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామి ఇచ్చారు. పిప్రి నుంచి దేగాం వరకు డబుల్ బెడ్‌రూం నిర్మాణం చేప డతామన్నారు. త్వరలోనే ఆర్మూర్ పట్టణంలో డబుల్ బెడ్ రూంలు ప్రజల కు పంపిణీ చేస్తామని ప్రజల సమస్యలు ఏము న్నా వెంటనే పరిష్కరి స్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాజ గంగారాం, మాజీ ఎంపీటీసీ కేసీ ముత్తెన్న, రోహిత్‌రెడ్డి, హెచ్ఎం, ఉపాధ్యాయు లు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

▸▸ జిల్లా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్



మోర్తాడ్‌లో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారులు

మోర్తాడ్,సెప్టెంబరు,23(ఆంధ్రజ్యోతి):ప్రజలకు మెరుగైన సేవలు అందించి ప్రజల మెప్పు పొందాలని మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో స్వస్థ్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో దంత వైద్య నిపుణులు డాక్టర్ ప్రవీణ్ కుమార్, న్యూఫిజిషన్ డాక్టర్ చంద్రశేకర్, జనరల్ సర్జన్ డాక్టర్ సునీత, డాక్టర్ వివేక్ రోగులను పరీక్షించారు.ఈ కార్యక్రమంలో ఫార్మాసిస్టు సంజీవ్, గంగాధర్‌గౌడ్, ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

పాఠశాలకు నోటీలు జారీ

ఆర్మూర్ , సెప్టెంబరు, 23(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడి పల్లి శివారులో ఉన్న పాఠశాలకు మంగళవారం ఎంఈవో రాజగంగారాం నోటీలు జారీ చేశారు. పాఠశాల వారు పరీక్షల పేరిట సెలవు రోజుల్లో పాఠశాలను నడుపుతున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు నోటీలు జారీ చేశారు.సెలవు రోజులలో పిల్లలను పాఠశాలలకు రప్పించకూడదని ఎవరైనా ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఎంఈవో హెచ్చరించారు.

జీపీ కార్మికులకు వెంటనే వేతనాలు ఇవ్వాలి

ఆర్మూర్ , సెప్టెంబరు, 23(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలను వెంటనే అందజేయాలని డిమాండ్ చేస్తు మగళవారం ఆర్మూర్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వ హించారు.ఈసందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి కుతాడి ఎల్లయ్య మాట్లాడుతూ గత మూడు నెలలుగా జీపీ కార్మికులకు వేతనాలు రావడం లేదని తక్షణమే విడుదల చేయాలన్నారు. అదే విధంగా కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని అందరు ఉద్యోగుల మాదిరిగా అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గంగారాం, విజయ్, లక్ష్మయ్య, మచ్చర్ల రాజుబాయి, తదితరులు పాల్గొన్నారు.

టీయూసీఐ ఆధ్వర్యంలో ధర్నా

మోస్రా,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికులకు అగ్రిమెంట్ ప్రకారం ఇవ్వాల్సిన కూలీలో నుంచి రూ.10 అక్రమంగా కోత పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ కార్మికులకు వేయి బీడీలకు సరిపడ మంచి తునికాకు ఇవ్వాలని, కార్మికులను వేధింపులకు గురి చేయడాన్ని ఆపివేయాలంటూ తదితర డిమాండ్ల సాధనకై తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్(టీయుసీఐ) బోధన్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో మోస్రా మండల కేంద్రంలో గల దేశాయి బీడీ సెంటర్ ముందు ధర్నా నిర్వహించడం జరిగింది.కార్మికులను వేధింపులకు గురి చేయడాన్ని ఆపి వేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తరువాత సెంటర్ మేనేజర్ శైలేష్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఇచ్చి చర్చలు జరపడం జరిగింది. చర్చల ఫలితంగా మేనేజర్ మాట్లాడుతూ బ్రాంచులలో ఉన్న ఆకులో ఖరాబు ఆకునంతటిని వాపస్ తీసుకుంటాము, మంచి ఆకు మాత్రమే కార్మికులకు వేస్తామని కార్మికులను వేధింపులకు గురి చేయడాన్ని ఆపివేస్తామని కార్మికులకు ఇచ్చే కూలీలు పది రూపాయల కోత విషయంలో ఇతర విషయాలను కంపెనీలోని పై బాధ్యులతో మాట్లాడి పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లేష్, జిల్లా నాయకులు సాయిరెడ్డి, మరియు బోధన్ ఏరియాకు సంబంధించిన టీయుసీఐ నాయకులు ఈర్షద్, అమ్జాద్, ఆజాద్ పాల్గొన్నారు.

వాలీబాల్ అభివృద్ధికి కృషి చేస్తాం

ఆర్మూర్,సెప్టెంబరు,23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వాలీబాల్ అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గజ్జెల రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి ఎన్‌వి హన్మంత్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధి పెర్కిట్‌లోని మీనాక్షి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం తెలంగాణ వాలీ బాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం, వాలీబాల్ అసోసియేషన్ ఎన్నిక లను నిర్వహించారు.ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా లోక భూపతి రెడ్డి, చంద్రారెడ్డి, వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ఇండియా అబ్జర్వర్‌గా హాజరయ్యారు.

రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ కార్యవర్గం

తెలంగాణ వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గజ్జెల రమేష్‌బాబు, (వరంగల్), ప్రధాన కార్యదర్శిగా ఎన్‌వి హన్మంత్‌రెడ్డి (నిజామాబాద్), కోశాధికారిగా కృష్ణప్రసాద్ (ములుగు), ఉపాధ్యక్షులుగా జి. ప్రకాష్, వెంకటేశ్వర్ రావు, మల్లారెడ్డి, సంయుక్త కార్యదర్శిగా లక్ష్మణ్, శంకర్, మహ్మద్ అనిఫ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మల్లేష్‌గౌడ్, శ్రీనివాస్, రవీందర్, శ్రీదర్, యాదిరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

బాల్కొండలో పోషణ మాసం

ముప్కాల్, సెప్టెంబరు, 23(ఆంధ్రజ్యోతి):చిన్నారులు, బాలింతలు, గర్భిణుల్లో పోష కాహార లోపాన్ని నివారించేందుకు పోషణమాసం యొక్క ముఖ్య లక్ష్యమని సీడీపీవో భార్గవి అన్నారు. మంగళవారం బాల్కొండలోని కేసీఆర్ ఫంక్షన్‌హాల్‌లో సామూహిక సీమంతాలు నిర్వహించారు. ప్రతీ సం వత్సరం నిర్వహించే పోషణమాసంలో బాగంగా గర్భిణీలకు పోషకాహారం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్ర మంలో ఎంఆర్‌వో శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రమాదేవి, అంగన్‌వాడి టీచర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మహిళా ..



బతుకమ్మ పేర్చడం ప్రత్యేకంగా ఉంటుంది..

రంగురంగు పువ్వులతో బతుకమ్మ పేర్చడం చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ప్రకృతితో కూడుకున్న పండుగ ఇది. బతుకమ్మలో వాడే ప్రతీ పువ్వులో ఔషధగుణాలు ఉంటాయి. అంగన్‌వాడీ కేంద్రాలలో తోటి వారితో బతుకమ్మ ఆడుతూ చాలా ఆనందంగా గడుపుతాను. మహిళలు ఈ పండగ కోసం ప్రత్యేకంగా ఎదురు చూస్తుంటారు.

● కళావతి రాథోడ్ , ఇన్‌చార్జి సీడీపీవో, బాన్సువాడ



వివిధ ప్రాంతాల్లో జరుపుకొంటున్నాం..

మా సొంతూరు సిద్దిపేటలో బతుకమ్మ పండగను ఎంతో సంతోషంగా జరుపుకుంటాము. చిన్నప్పుడు స్నేహితులతో కలసి బతుకమ్మ ఆడేవాళ్లము. 2020 అక్టోబరులో నాకు ఎస్సైగా ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం ఉద్యోగరీత్యా వివిధ చోట్ల విధులు నిర్వహిస్తున్నాను. దీంతో సిబ్బంది, స్థానిక మహిళలతో కలసి బతుకమ్మను ఘనంగా జరుపుకుంటాం.

● డి.స్రవంతి, ఎస్సై, దోమకొండ



తొమ్మిది రోజులు సంతోషంగా వేడుకలు..

మా సొంతూరు సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం. దోమకొండ మండల వ్యవసాయాధికారిగా విధులు నిర్వహిస్తున్నాను. బతుకమ్మ పండగను 9 రోజుల పాటు చాలా సంతోషంగా జరుపుకుంటాం. చిన్నప్పటి నుంచి అమ్మ, అక్కతో పాటు స్నేహితులు, కాలనీ వాసులతో బతుకమ్మ ఆడేవాళ్లం. ప్రతి రోజు బతుకమ్మ సంబారాల్లో పాల్గొంటాను.

● మణిదీపిక, ఏవో, దోమకొండ



స్వర్ణకవచ దేవీ అవతారంలో అమ్మవారు



బాన్సువాడ సరస్వతీ ఆలయంలో..

బాన్సువాడటౌన్ , సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీ విద్యాజ్ఞాన సరస్వతీ దేవి ఆలయంలో అమ్మవారు శ్రీ స్వర్ణకవచ దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి భక్తులు ఆలయంలో హోమం, అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ ధర్మకర్త శంభురెడ్డి దంపతులు, వినోద్, అరుణ్‌రెడ్డి, తదితరులు న్నారు.

● మరోవైపు శ్రీరామ ఆలయంలో మంగళవారం రాత్రి భక్తుల కోసం గంగారపు సంతోష్ కుటుంబ సభ్యులు అల్పాహారం ఏర్పాటుచేశారు. రాత్రి వేళలో దాండియా పాటలపై మహిళలంతా స్టెప్పులేశారు.



శ్రీరామ మందిరంలో కొలువుదీరిన అమ్మవారు



బీర్కూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

అంగన్‌వాడీలో బతుకమ్మ సంబురాలు

బీర్కూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని 4వ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషకాహార మాస ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలు సేకరించి బతుకమ్మలను అందంగా అలంకరించారు. అంగన్‌వాడీ సిబ్బంది, పలువురు స్థానిక మహిళలు బతుకమ్మ పాటలకు లయబద్ధంగా ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో సౌభాగ్య, సూపర్‌వైజర్ సుమలత, అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన బిడ్డల కోసమే సామూహిక సీమంతాలు

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన బిడ్డల కోసమే ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటుచేసి పౌష్టికాహారం అందిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హారతి అన్నారు. ఎల్లారెడ్డి పట్టణకేంద్రం ఒకటో వార్డులోని ఎర్రమన్నుకుచ్చ ప్రాంతంలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌లో మంగళవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె హాజరై మాట్లాడారు. ఎల్లారెడ్డి ఐసీడీఎస్ ప్రాజెక్టు అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. గర్భిణులకు చీర, సారె, పూలు, పండ్లతో ఈ కార్యక్రమం నిర్వహించడం ద్వారా గర్భిణులు ఆనందంతో ఉంటారని తెలిపారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో సీమంతాలు, అన్నప్రాసన వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హారతి, అంగన్‌వాడీ టీచర్ మంజుల, ఆశా వర్కర్, ఆరోగ్య కార్యకర్త, పిల్లల తల్లిదండ్రులు, పలువురు గర్భిణులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీకి సీమంతం చేస్తున్న దృశ్యం

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు చౌట్‌పల్లి విద్యార్థి



కమ్మర్‌పల్లి, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్-16 సబ్‌జూనియర్స్ కబడ్డీ పోటీలకు చౌట్‌పల్లిలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థి జాన్‌పాల్ నాయక్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు, ఎంఈవో ఆంధ్ర య్య, వ్యాయామ ఉపాధ్యాయులు కల్లెడ నగేష్ తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండల కేంద్రంలో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టుతరఫున జాన్‌పాల్ నాయక్ పాల్గొననున్నారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఎంఈవో, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లింగయ్య, గంగా .దర్, ఉపాధ్యక్షులు రాజ్‌కుమార్‌లు అభినందించారు. రాష్ట్రస్థాయిలో మంచి క్రీడాప్రతిభను కనబరుస్తు జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.



సీఎం ప్రవాసి ప్రజావాణిని ఆశ్రయించిన బాధిత కుటుంబ సభ్యులు

దుబాయ్ పోలీసుల అదుపులో మోర్తాడ్ యువకుడు

● తమ కుమారుడిని విడిపించాలని ప్రవాసి ప్రజావాణిలో వినతి

మోర్తాడ్, సెప్టెంబరు, 23(ఆంధ్రజ్యోతి): మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన బాస గణేష్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) దేశంలోని అబుదాబిలో వ్యవసాయ కూలీ వీసాతో పనిచేస్తున్నాడు. అయితే గత జూన్ మొదటి వారం నుంచి దుబాయిలోని రశీదియా పోలీస్ స్టేషన్‌లో అదుపులో ఉన్నాడు. టెలికాం, సిమ్‌కార్డులు, బ్యాంకింగ్ లావాదేవీలకు సంబంధించిన ఓ కేసులో గణేష్‌ను దుబాయి పోలీస్‌లు విచారిస్తున్నారు. ఈ విషయమై తమకు న్యాయ సహాయం అందించి, దుబాయి జైలు నుంచి కొడుకును విడిపించాలని అతని తల్లి బాస లక్ష్మీ, అక్క సంజన మంగళవారం హైదరాబాద్‌లోని సీఎం ప్రవాసీ ప్రజావాణిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరిట వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ప్రభుత్వ నియమిత ఎన్‌ఆర్‌ఐ అడ్వైజరీ కమిటి వైస్ చైర్మన్ మంద బీమ్‌రెడ్డి వారికి మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా ఎమిగ్రెంట్స్ వెల్ఫేర్ ఫోరం ప్రతినిధి మహ్మద్ బషీద్ హైమాద్, సౌదీ అరేబియా తెలుగు అసోసియేషన్ రియాద్ శాఖ ఉపాధ్యక్షుడు మహ్మద్ నురోద్దిన్ గణేష్ కుటుంబానికి భరోసా ఇచ్చారు.



మహిళలకు శిక్షణ ఇస్తున్న సీబీవో ఆడిటర్ మధు

మహిళా సంఘం పుస్తకాలపై శిక్షణ

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు, 23(ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లిలోని ఐకేపీ కార్యాలయంలో గ్రామ మహిళ సంఘం పుస్తకాలపై మంగళవారం సీబీవో ఆడిటర్ మధు శిక్షణ ఇచ్చారు. ప్రతీ మహిళ గ్రామ సంఘంలో జరిగే అన్ని ఆర్థికంగా లావాదేవీలు, రశీదులు ఇవ్వాలని, పొదుపులు, అంతర్గత అప్పులు సక్రమంగా వసూలు చేయాలని మహిళ సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. గ్రామ సంఘంలో నిర్వహించే అన్ని రకాల పుస్తకాలపై శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, కమ్యూనిటి కోఆర్డినేటర్లు, గ్రామ సంఘాల వివోఏలు, అకౌంటెంట్‌లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ స్థానాలు పెంచాలని వినతి

మెండోర, సెప్టెంబరు, 23(ఆంధ్రజ్యోతి): మేజర్ గ్రామపంచాయతీల్లో రెండు ఎంపీటీసీ స్థానాలుంటే ప్రజలకు మేలైన పరిపాలన అందుతుందని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మాకురి మహేష్ మాదిగ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎంపీటీసీ స్థానాలు పెంచాలని తహసీల్దార్ సంతోష్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఏ గ్రామంలోనైనా 3545 ఓటర్ల సంఖ్య ఉంటే ఎలక్షన్ కమీషన్ రెండు ఎంపీటీసీ స్థానాలు పెంచవచ్చని చెపుతుందన్నారు. అయితే 3545 ఓటర్లు ఉన్న గ్రామాల్లో ఇంకా ఒకే ఎంపీటీసీ స్థానం ఉందని, ఇప్పటికైనా అధికార యంత్రాగం స్పందించి ఓటర్ సంఖ్య ఎక్కువ ఉన్న గ్రామాల్లో రెండు ఎంపీటీసీ స్థానాలు పెంచాలని కోరారు. కార్యక్రమలో ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు గుంటి నిశాంత్, మాదిగ తదితరులు పాల్గొన్నారు.

రావణదహన స్థలం పరిశీలన

బాన్సువాడటౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో బతుకమ్మ ఆడేందుకు, రావణదహన స్థలాన్ని మంగళవారం మున్సిపల్ కమీషనర్ శ్రీహరిరాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్ పరిశీలించారు. అవసరమున్న చోట మొరం వేయించారు. బతుకమ్మ కుంటల వద్ద పరిసరాలను శుభ్రం చేయాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. నాయకులు నర్సుగొండ, పంతులు నరేశ్ ఉన్నారు.



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

నూతన కార్యవర్గం ఎన్నిక

బాన్సువాడటౌన్ , సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చైతన్యకాలనీ (బీసీ హాస్టల్‌రోడ్) నూతన కార్యవర్గాన్ని కాలనీవాసులు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విఠల్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సంతోష్‌రెడ్డి, వేద్‌ప్రకాశ్ , ప్రధాన కార్యదర్శిగా కులకర్ణి రఘు, కమిటీ సభ్యులను, సహాయ కార్యదర్శులను ఎన్నుకున్నారు. కాలనీ అభివృద్ధి కోసం తన వంతు కృషిచేస్తానని నూతన అధ్యక్షుడు అన్నారు.



ఇంటి నిర్మాణానికి ముగ్గు వేస్తున్న దృశ్యం

ఇందిరమ్మ ఇంటికి ముగ్గులు

బాన్సువాడటౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో మంగళవారం అధికారులు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గు వేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఖాలేక్, గౌస్, అధికారులు తదితరులున్నారు.



నసురుల్లాబాద్‌లో వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ అరుణ

వరి పంటల పరిశీలన

నసురుల్లాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వరి పంటలను మంగళవారం ఏడీఏ అరుణ రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వరి తెగుళ్ళ నివారణకు సంబంధించి రైతులకు పలు సూచనలు చేశారు. పిలకలు తొడిగే దశలో ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడి, డాగు మచ్చలుగా మొదలై, అంచుల వెంబడి మట్టల వరకు వ్యాపిస్తుందని తెలిపారు. తెగుళ్ల నివారణకు నత్రజని ఎరువులను వేయడం తాత్కాలికంగా వాయిదా వేయాలన్నారు. అనంతరం ప్లాంటో మైసిన్, కాపర్ ఆక్సీ క్లోరైడ్ నీటిలో కలిపి పంటలకు పిచికారీ చేయాలన్నారు. ఆమె వెంట ఏఈఓ గోపాల్, రైతులు, గ్రామస్తులు ఉన్నారు.



విద్యార్థినిని సన్మానిస్తున్న ఏఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు

మెడికల్ విద్యార్థినికి సన్మానం

మద్నూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డోంగ్లి మండలం హసన్ టాక్లి గ్రామంలో నిరుపేద కుటుంబీకులైన నక్కేవార్ శంకర్ దంపతుల కుమార్తె చందన ప్రభుత్వ వైద్య కళాశాల సూర్యాపేటలో సీటు సాధించింది. ఈ మేరకు మంగళవారం విద్యార్థినికి ఏఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఆయాల సంతోష్, ఫౌండేషన్ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబంలో జన్మించిన విద్యార్థిని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు.

పైరవీలు చేసే వారితో అభివృద్ధి జరగదు: ఎమ్మెల్యే

బీర్కూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేగా గెలిచిన వారు హైదరాబాద్‌లో కూర్చుని పైరవీలు చేసుకుంటూ సంపాదించుకుంటే నియోజక అభివృద్ధి జరగదని, ప్రజల మధ్యలో తిరుగుతూ, ప్రజా సమస్యలు తెలుసుకుని నిరంతరం శ్రమిస్తేనే అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన రాష్ట్ర ఆగ్రోస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి బీర్కూర్‌లో పర్యటించారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో రూ.65 లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం అక్కడే ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే పోచారం మాట్లాడుతూ.. బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేయడమే తన లక్ష్యమని అన్నారు. రాష్ట్రంలో 119 నియోజకవర్గాలు ఉన్నాయని, ఎవరికి ఎంత దమ్ము ఉందో వాళ్లు అంతలా తమ నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో 10 వేల పైచిలుకు ఇళ్లను పేదలకు నిర్మించి ఇచ్చామన్నారు. బీర్కూర్‌లో ఇప్పటికే అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామని, ఇంకా ఎక్కడైనా అవసరం ఉంటే నిధులు మంజూరు చేసి వంద శాతం పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శశి కాంత్, శంకర్, రాములు, కార్యకర్తలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పోచారం

సొంత పార్టీ నాయకులే కవితకు వెన్నుపోటు పొడిచారు

● డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ కూతురు కవిత ఎదుగుదలను చూసి ఓర్వలేకే సొంత (బీఆర్ఎస్) పార్టీ నాయకులే వెన్నుపోటు పొడిచి ఆమె ఓటమికి కారణమయ్యారని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. మంగళవారం బాన్సువాడ మండలంలోని పోచారం గ్రామంలో వర్ని మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. 2019 ఎంపీ ఎన్నికల్లో అప్పటి జిల్లా మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, షకీల్, జీవన్‌రెడ్డి కుట్రపన్ని కవితను ఓడించారన్నారు. ఎన్నికల్లో వేముల ప్రశాంత్‌రెడ్డికి మెజారిటీ వస్తే, అదే కవితకు మాత్రం ఓట్లు మైనస్ ఎలా అవుతాయని ఆయన ప్రశ్నించారు. అప్పట్లో పోచారం శ్రీనివాస్‌రెడ్డి మంత్రిగా ఉండి ఉంటే ఖచ్చితంగా కవిత ఎంపీగా గెలిచి ఉండేవారన్నారు. ఉమ్మడి నిజామాబాద్ డీసీసీబీ చైర్మన్‌గా ఉన్నపుడు కాంగ్రెస్‌తో చీకటి ఒప్పందం కుదుర్చుకున్న వేముల ప్రశాంత్‌రెడ్డి తనకు కూడా ద్రోహం చేశారని మండిపడ్డారు. సొంత పార్టీ నాయకులే వెన్నుపోటు పొడిస్తే ఆ బాధ వర్ణనాతీతంగా ఉంటుందన్నారు. బాన్సువాడ అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అండ తీసుకోవడం తప్పా అని ఆయన బీఆర్ఎస్ నాయకులను ప్రశ్నించారు. బాన్సువాడ నియోజకవర్గంలో ప్రజల కోసం పోచారం కుటుంబం ఎల్లపుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. బాన్సువాడలో బై ఎలక్షన్లు వస్తాయని అనుభవం లేని నాయకులు చెబుతున్నారని, అసలు బై ఎలక్షన్ల ముచ్చట లేనే లేదని ఆయన తేల్చి చెప్పారు. బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అహర్నిషలు కృషి చేస్తున్నారన్నారు.

బతుకమ్మ ఘాట్ల వద్ద ఏర్పాట్లు చేయాలి

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ నిమజ్జన ఘాట్ల వద్ద తగిన ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలో బతుకమ్మ ఘాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం వివిధ వార్డులలో పరిశీలించి ఇంటి ఆవరణలో వర్షపు నీరు నిలవకుండా దిగువకు వెళ్లేలా చూడాలని అన్నారు. అదేవిధంగా, సీజనల్ వ్యాధుల దృష్ట్యా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాలనీవాసులకు సూచించారు. అనంతరం వర్షాల కారణంగా కూలీన నివాసపు ఇళ్లను పరిశీలించి శిథిలావస్థలో ఉన్న నివాసాలలో వర్షాలు పడుతున్న సమయంలో ఉండకూడదు అని చెప్పారు. ఆయనతో పాటు మున్సిపల్ సిబ్బంది, నాయకుడు తిరుపతి, మాజీ సర్పంచ్ పప్పు వెంకటేశం, పాల్గొన్నారు.



బతుకమ్మ నిమజ్జన ఘాట్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

నానో యూరియా వినియోగించాలి

మోపాల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాడ్సి ప్రాథమిక సహకార సంఘం ఎరువుల గోదాంను మంగళవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు నానో యూరియాను వినియోగించాలని సూచించారు. యూరియాను అధికంగా వాడవద్దని చెప్పారు. నానో యూరియా వాడటం వల్ల పంటలు అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు యూరియా విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సొసైటీకి వచ్చే రైతులకు అన్ని రకాల ఎరువులను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అన్నారు. గోదాంలో ఉన్న యూరియా రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట అధికారులు, మండల రైతులు తదితరులు ఉన్నారు.

శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం

● పెచ్చులూడుతున్న స్లాబ్, భయాందోళనలో అధికారులు

ఆర్మూర్ టౌన్, సెప్టెంబరు, 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. నిజాం కాలంలో నిర్మించిన ఈ కార్యాలయం కొద్దిపాటి వర్షానికే నీరు స్లాబ్, గోడలలోకి చేరుతుంది. గతంలో స్లాబ్‌ను మరమ్మతులు చేయగా కొన్నేళ్లు సమస్య రాలేదు. కానీ ప్రస్తుతం గోడలకు పాకురు వచ్చి శిథిలావస్థకు చేరింది. ఇటీవల అధికారులు విధులు నిర్వహిస్తుండగా స్లాబ్‌లో కొంతభాగం పెచ్చులూడి కిందపడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ఘటన జరగలేదు. నిజాం కాలంలో తెల్లసున్నంతో నిర్మించిన ఈ భవంతి సుమారు వందేళ్ళ నాటిది. అయితే ఎవరికీ ఎలాంటి హాని జరుగకముందే తొలగించి నూతన నిర్మాణం చేపడితే బావుంటుందని ప్రజలు భావిస్తున్నారు. వర్షాలు వస్తున్నాయంటే రికార్డుల రూం సంగతి చెప్పాల్సిన అవసరం లేదు. రికార్డులపై ఫ్లెక్సీలను కప్పి, వర్షపు నీరు ధారగా వచ్చే ప్రదేశంలో బకెట్‌లను పెట్టి భూముల రికార్డులను కాపాడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనాన్ని నిర్మించాలని వేడుకుంటున్నారు.



వర్షపు నీటికి గోడలకు పాకురు పట్టిన దృశ్యం



పెచ్చులూడుతున్న భవనం



రికార్డులు తడవకుండా కప్పిన ఫ్లెక్సీలు

ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల నిర్మాణం చేపట్టేనా

ఇటీవల ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల నిర్మాణం చేపట్టాలని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయ ఆవరణను పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు విషయంలో ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, అధికార పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వినయ్‌రెడ్డి వేరువేరు స్థలాలను ఎంపిక చేశారు. దీంతో అధికారులు తలలు పట్టుకునే పరిస్థితి ఏర్పడింది. ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల నిర్మాణం చేపడుతారో లేదో వేచి చూడాలి.

కేంద్రం నిధులు పక్కదారి: ఎంపీ

(5వ పేజీ తరువాయి)

ప్రదేశాల్లో రోడ్డు విస్తరణకు మార్గమం సుగమం అయ్యిందన్నారు. పీఎం విశ్వకర్మ పథకం కింద అర్హులైన వారందరూ లబ్ధిపొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పథకం అమలులో మూడవ స్థానంలో ఉన్న నిజామాబాద్ జిల్లాను మొదటి వరుసలో నిలపాలన్నారు. పీఎంసీ పథకం పై ఎంపీ వివరాలు కోరగా ఈ పథకం జిల్లాలో 8 పాఠశాలలకు కేంద్రం ద్వారా నిధులు మంజూరు అయ్యాయని అదనపు తరగతి గదుల నిర్మాణం, లైబ్రేరీలు, ప్రయోగశాల, క్రీడా పరికరాలు, మైదానాల అభివృద్ధి కోసం వెచ్చించామని డీఈవో అశోక్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన కోడిగుడ్లు, పౌష్టికాహారం అందేలా పర్యవేక్షణ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇటీవల వరదల వల్ల నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి స్పందిస్తూ గోదావరి, మంజీరా బ్యాక్‌వాటర్ కారణంగా జిల్లాలో పరివాహక గ్రామాలు ఆనుకొని ఉన్న పంటలు నీటమునగడం జరిగిందని ఇప్పటికే పంట నష్టం జరిగిన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ప్రభుత్వానికి సమగ్ర వివరాలతో నివేదిక పంపామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో వివిధ శాఖల ద్వారా కొనసాగుతున్న పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంఆర్‌ఐ స్కానింగ్ యంత్రం లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని సమావేశం దృష్టికి మానిటరింగ్ కమిటీ సభ్యులు బెజవాడ గణేష్ తేవడంతో ఎంపీ అర్వింద్ కలెక్టర్ దృష్టికి తేవడంతో త్వరలో ఎంఆర్‌ఐ స్కానింగ్‌ను అందుబాటులోకి తెచ్చేలా చూస్తానని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, డీఎఫ్‌వో వికాస్ మీనా, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తి యాన్ మావీ, నగర పాలకసంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, డీఆర్‌డీవో సాయాగౌడ్, దిశ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రెవెన్యూ విభాగాన్ని ప్రక్షాళన చేయాలి: ఎమ్మెల్యే

నగర పాలక సంస్థలోని రెవెన్యూ విభాగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త అన్నారు. పూలాంగ్‌వాగు, డి54 కెనాల్ పూర్తి కబ్జాకు గురైందని నగరంలోని రామర్తి బొందం చెరువు కూడా కబ్జాకు గురయ్యాయని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. నగర పాలక సంస్థలోని తిలక్‌గార్డెన్ వాణిజ్య సముదాయాల్లో బినామీలు వ్యాపారాలు నిర్వహిస్తున్నారని కార్పొరేషన్‌కు నామమాత్రం అద్దె చెల్లించి సంవత్సరాల తరబడి చెల్లించడం లేదని అన్నారు.

ఆర్మూర్ అధికారిపై ఎంపీ సీరియస్..

ఆర్మూర్ డివిజన్‌లో అధిక శాతం పనులు పెండింగ్ ఉండటంపై ఆర్మూర్ పంచాయతీరాజ్ శాఖ అధికారి రాజేశ్వర్‌ను అడగగా అధికారి రాజేశ్వర్ సమైన సమాధానం చెప్పకపోవడంతో ఎంపీ అర్వింద్ రాజేశ్వర్‌పై మండిపడ్డారు. పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు.

కబ్జాలపై చర్యలు తీసుకుంటాం : కలెక్టర్

నగరంలోని మల్లారం, సారంగపూర్ హనుమాన్ మందిరం తదితర ప్రాంతాల్లో ఫారెస్టు భూములు అక్రమలకు గురవుతున్నాయని దిశ కమిటీ సభ్యులు ప్రస్తావించగా పోలీస్, రెవెన్యూ శాఖల సహకారంతో సమగ్ర విచారణ జరిపిస్తామని ఆక్రమణలు తొలగించి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి స్పష్టం చేశారు.

నాసిరకం కోడిగుడ్ల పంపిణీపై ఆగ్రహం..

అంగన్‌వాడీల్లో నాసిరకం కోడిగుడ్లు పంపిణీ చేస్తున్నారంటూ మానిటరింగ్ కమిటీ సభ్యులు విజయ ఆగ్రహం వ్యక్తం చేశారు. 40 నుంచి 60 గ్రాములు ఉండాల్సిన కోడిగుడ్డు కేవలం 20 నుంచి 30 గ్రాముల కోడిగుడ్డును సరఫరా చేసి అంగన్‌వాడీలకు సరఫరా చేసే ఏజెన్సీలు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయని అన్నారు. చిన్నగా ఉన్న కోడిగుడ్డును సభ్యులకు చూపించారు.

నగరంలో అడ్డగోలుగా టాక్స్ వసూళ్లు..

నగర పాలక సంస్థ పరిధిలో అడ్డగోలుగా పన్ను వసూలు చేస్తున్నారని దిశ కమిటీ సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ అలాంటి టాక్స్‌లను సరిచేస్తున్నామని తెలిపారు. నగరంలో 23 కోట్లకు పైగా టాక్స్‌లు రావాల్సి ఉందని సభ దృష్టికి తెచ్చారు. ఇందులో ప్రముఖ హోటళ్లే 13కోట్ల బకాయి ఉందని తెలిపారు.



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్, చిత్రంలో అర్బన్ ఎమ్మెల్యే

జీఎస్టీ తగ్గింపు ప్రజలకు దసరా కానుక

- ఆర్‌వోబీల ఆలస్యంపై దసరా తర్వాత ఉద్యమం
- విలేకరుల సమావేశంలో ఎంపీ అర్వింద్

నిజామాబాద్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జీఎస్టీ తగ్గింపు సవరణలు దేశ ప్రజలకు ప్రధాని మోదీ ఇచ్చిన దసరా కానుకని ఎంపీ ధర్మపురి అన్నారు మంగళవారం జిల్లా బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా చేసిన జీఎస్టీ సవరణలతో అన్ని వర్గాల వారికి లాభం జరుగుతుందన్నారు. 5 శాతం జీఎస్టీ ఉన్న వస్తువుల పన్నులను పూర్తిగా ఎత్తివేశారని 18 శాతం ఉన్న పనులను ఐదు శాతానికి తగ్గించారని ఆయన అన్నారు. తగ్గిన జీఎస్టీలతో సామాన్యులకు భారం తగ్గిందని రైతులకు మేలు జరుగుతుందన్నారు. జీఎస్టీ కమిటీ సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి కూడా పాల్గొన్నరని, జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రజలకు మేలు జరుగుతుంటే ముఖ్యమంత్రి మాత్రం బీజేపీపై విమర్శలు చేస్తున్నాడన్నారు. ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచడంపై సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడడం లేదని వెంటనే కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధిరామయ్యతో మాట్లాడాలన్నారు. ఆల్మట్టి డ్యాం హైట్ పెంచడం కాదు సీఎం రేవంత్ రెడ్డి హైటు పెంచుకోవాలని ఆయన ఎద్దేవా చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పెట్రోల్ డీజిల్‌పై అత్యధికంగా టాక్స్ వసూలు చేశాడన్నారు. ఈ విలేకరుల సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆర్‌వోబీల ఆలస్యంపై దసరా తర్వాత ఉద్యమం..

ఆర్‌వోబీల ఆలస్యంపై దసరా తర్వాత ఉద్యమిస్తామని అన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన దిశా సమావేశం అనంతరం ఎంపీ అరవింద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలోని నాలుగు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల నిధుల విషయంలో స్పందించడం లేదన్నారు. జిల్లా నుంచి పీసీసీ అధ్యక్షుడు, ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్న నిధులు ఇవ్వకపోవడం సిగ్గుచేటు అన్నారు. దసరా తర్వాత రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిధుల కోసం ఆందోళన చేపట్టాలని ఎమ్మెల్యేలు, రామ పార్టీ క్యాడర్ కు అరవింద్ పిలుపునిచ్చారు. ఎంపీ ల్యాండ్ నిధులతో చేపట్టిన పనులు కాంగ్రెస్ నేతలు అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు. జిల్లాలో వరదల వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వకపోవడం దారుణమని మరోసారి సర్వే చేసి వెంటనే నష్టపరిహారం ఇవ్వాలన్నారు.

పారిశుధ్యం ప్రథమ స్థానంలో ఉంచాలి



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సుభాష్‌నగర్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో నిజామాబాద్ కార్పొరేషన్‌ను పారిశుధ్యంలో మొదటి స్థానంలో నిలబెట్టే విధంగా ప్రతి అధికారి, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త అన్నారు. జిల్లా కేంద్రంలోని 45వ డివిజన్‌లోని శ్రీనగర్ కాలనీలో ఎమ్మెల్యే నగర పాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్‌తో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల హనుమాన్ మందిరం పక్కన ఉన్న అండర్ బ్రిడ్జి పాడైపోయినందున వాహనదారులకు ఇబ్బందిగా మారిందని అన్నారు. మరమ్మతులు చేసి శాశ్వత పరిష్కారంగా కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చారు. డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా మున్సిపల్ సిబ్బంది నిత్యం డ్రైనేజీ పూడికను తీయాలని అన్నారు. అవసరం ఉన్నచోట డ్రైనేజీ కాలువలు పునఃనిర్మాణం చేపట్టాలని కమీషనర్‌ను కోరారు. నగరంలో వీధిదీపాల కొరత పెద్ద మొత్తంలో ఉందని వీలైనంత త్వరగా వీధిదీపాల ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. కార్పొరేషన్ పరిధిలో ప్రజలకు కనీస సౌకర్యాలు బీటీ, సీసీ రోడ్లు, డ్రైన్‌లు, ఓపెన్ జిమ్‌లు, పార్కుల అభివృద్ధి, కల్వర్టుల నిర్మాణానికి స్పెషల్ ఫండ్ వంద కోట్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగిందన్నారు. నియోజకవర్గం అభివృద్ధి తన లక్ష్యం అని నగర ప్రజలకు మౌళిక సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు.ఏసీపీతో మాట్లాడి రాత్రి సమయంలో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట మున్సిపల్ ఏఈ పావని, స్థానిక నాయకులు ఆకుల శ్రీనివాస్, నరేష్, బొబ్బిలి వేణు, ఎర్రన్న, బీజేపీ నాయకుడు పవన్ ముండాడ, ఆనంద్, కాలనీవాసులు పాల్గొన్నారు.

దివ్యాంగ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

ధర్పల్లి,సెప్టెంబరు23 (ఆం ధ్రజ్యోతి):మండల కేం ద్రంలో గల దివ్యాంగ పాఠశాల లో మంగళవారం బతుకమ్మ సం బరాలను ఘనంగా నిర్వ హించారు.ఈసందర్భంగా తల్లి దం డ్రులు,విద్యార్థులు వేడు కల్లో పాల్గొన్నారు. బతుకమ్మ పండు గ గురించి పాఠశాల సిబ్బంది దివ్యాంగ విద్యార్థులకు వివరించారు. వ్యక్తి గత కార్యక్రమాలు, రోజువారి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీసీబుచ్చన్న, రేణుక, రాధిక, స్వప్న పాల్గొన్నారు.

ఆసుపత్రిలో రోగుల ఇబ్బందులను తీర్చాలి

నిజామాబాద్‌లీగల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సమస్యలు తిష్టవేసిన విధా నాల గూర్చి సోషల్ మీడియా లో కథనాలు రావడాన్ని చూసి సుమోటో పిటిషన్‌గా స్వీకరించిన జిల్లా ప్రధాన న్యాయాధికారి,జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్‌పర్సన్ జీవీఎస్.భారతలక్ష్మీ, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అధికా రులను పిలిపించి ఆసుపత్రిలో రోగులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరి ష్కార మార్గాలను వెతకాలని సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్ భాస్కర్‌రావు ను ఆదేశించడంతో, ఆయనమంగళవారం ప్రభుత్వ జనరల్‌ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, అదనపు సూపరింటెండెంట్ డాక్టర్ రాములు లను జిల్లాకోర్టు ప్రాంగాణంలోని సంస్థ కార్యాలయం న్యాయసేవ సదన్ కు పిలిపించి మాట్లాడారు. ఆసుపత్రి బయట చుట్టుపక్కల అంతస్థుల పైనుంచి పైపుల లీకేజీ వలన ఇబ్బందులు, లిఫ్టులు కొన్ని పని చేయక పోవడం రోగులు పడుతున్న ఇబ్బందుల గురించి తెలుసుకోని, వివరాలు అడిగి తెలుసుకోన్నరు సరైన తీరులో ఉపయోగంలోకి తేవడానికి ఆర్థిక వనరులు ఉన్నాయని సంబంధిత ఇంజనీర్లతో, కాంట్రాక్టర్లతో సంప్రదించి తగిన చర్యలు తీసుకుంటామని సుపరింటెండెంట్ తెలియజేశారు.

నష్ట పరిహారం చెల్లించాలి

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):పురాతనమైన రైస్‌మిల్ గోడకూలి పక్క ఇంటిపై పడి మృతి చెందిన కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి ఓమయ్య, సాయమ్మ, భూలక్ష్మి, కౌసల్య, లింగవ్వ, పుష్ప, కిష్టయ్య, సాయిలు, శంకర్, పాల్గొన్నారు.

విద్యార్థులకు చదువే ఆయుధం



బహుమతి అందజేస్తున్న డీఐఈవో

సుభాష్‌నగర్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులకు చదువే ఆయుధం అని బాగా చదివి మంచి ఫలితాలు సాధించాలని ఇంటర్ విద్యా జిల్లా ప్రత్యేక అధికారి దాసరి ఒడ్డెన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఫ్రెషర్స్ పార్టీకి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నిజామాబాద్ బాలికల కళాశాలలో మంచి మార్కులు కొంత మంది విద్యార్థులు మాత్రమే సాధిస్తున్నారని అన్నారు. విద్యార్థులకు విద్యనే ఆయుధం అని వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా అధ్యాపకులు విద్యాబోధన చేయాలని అన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు, టీవీలకు దూరమైతేనే మంచి ఫలితాలు సాధ్యమవుతందని అన్నారు. అనంతరం జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపూడి రవికుమార్ మాట్లాడుతూ బాలికల కళాశాలలో అత్యధిక అడ్మిషన్‌లతో పాటు మంచి మార్కులు సాధిస్తున్నప్పటికీ ఉత్తీర్ణత శాతాన్ని మరింత పెంచేందుకు అధ్యాపకులు, విద్యార్థులు కృషి చేయాలన్నారు. వంద శాతం విద్యార్థులు కళాశా లకు హాజరైతే అన్ని సబ్జెక్టులలో ఉత్తీర్ణుల వుతారని అన్నారు. అంతకు ముందు విద్యార్థుల ఆట పాటలు ఆహుతులను అలరించాయి. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ చిన్నయ్య, బాల్కొండ ప్రిన్సిపల్ రజియుద్దీన్ అస్లాం, ధర్పల్లి కళాశాల ప్రిన్సిపల్ శ్రీనాథ్, వర్ని కళాశాల ప్రిన్సిపల్ కల్పనకుమారి, బాలికల కళాశాల అకాడమిక్ అర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడు ఫయాముద్దీన్, పాల్గొన్నారు.

మహబూబాబాద్ మెడికల్ సూపరింటెండెంట్‌పై దాడిపై నిరసన

ఇందూరు, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి):మహబూబాబాద్ మెడికల్ కాలేజీ అనుబంధ ఆసుపత్రి సూపరింటెండెంట్‌పై దాడిని వ్యతిరేకిస్తూ నిజామాబాద్ జిల్లా మెడికల్ కాలేజీ ఆసుపత్రి వైద్యులు, మెడికోలు నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని ఆసుపత్రి ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి సంఘీభావం ప్రక టించారు. మహబూబాబాద్ సూపరిటెండెంట్‌పై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. డాక్టర్లకు సురక్షితమైన పనివాతావరణం కల్పించాలని కోరారు.ఆసుపత్రిలో స్పెషల్ పోలీస్ ప్రొటెక్షన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వైద్యులు గౌరప్రధంగా పనిచేయడానికి కృషి చేయాలన్నారు.ఈకార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు జలగం తిరుపతిరావు, తదితరులు ఉన్నారు.

రైస్ రీసెర్చ్ సెంటర్‌ను పరిశీలన



మాట్లాడుతున్న గడుగు గంగాధర్

సుభాష్‌నగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ సెంటర్‌ను మంగళవారం రాష్ట్ర రైతు కమీషన్ సభ్యుడు గడుగు గంగాధర్ పరిశీలించారు. రాష్ట్ర రైతు కమీషన్ చైర్మన్ కోదండరెడ్డితో కలిసి వ్యవసాయ కమీషన్ సభ్యులు రీసెర్చ్ సెంటర్‌ను పరిశీలించారు.ఈ సందర్భంగా నూతన వ్యవసాయ పద్దతులతో పాటు కొత్త వరి వంగడాల గురించి శాస్త్రవేత్తలు సభ్యులకు వివరించారు. ఈ రీసెర్చ్ ద్వారా వరిలో కొత్త కొత్త వంగడాలను తయారు చేయడమే కాకుండా అధిక దిగుబడిని ఇచ్చేవ ఆటిని ఉత్పత్తి చేసేలా పరిశోధనలు జరుగుతున్నాయని అన్నారు. ఈ రీసెర్చ్ సెంటర్ కేరళతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి రైతులు వచ్చి పరిశీలిస్తారని అధికారులు తెలిపారు. మన రాష్ట్రానికి చెందిన రైతులు ఈ రీసెర్చ్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకొని నూతన వరి వంగడాలను పండించాలని గడుగు గంగాధర్ సూచించారు.

దసరా కిక్కు.. లేనట్టేనా..?

(5వ పేజీ తరువాయి)

రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున మేకలు, గొర్రెలు, కోళ్లు, చేపలు, రొయ్యలను వ్యాపారులు దిగుమతి చేసుకుంటారు. అయితే దసరా ఒక వేల మాంసం దుకాణాలను మూసివేసినట్లయితే ముక్కపై తీవ్ర ప్రభావం ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

10వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం



ఆయుర్వేద పరికరాలను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ అంకిత్

ఇందూరు,సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డిపార్ట్మెంట్ ఆఫ్ ఆయుష్ శాఖ డైరెక్టర్ డాక్టర్ పి.శ్రీకాంత్ బాబు, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ వరంగల్ ఆయుష్ డాక్టర్ ప్రమీల దేవి ఆదేశాల మేరకు మంగళవారం ఆర్సపల్లిలోని వివేకానంద యోగ కేంద్రంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరంను జిల్లా అడిషనల్ కలెక్టర్ అంకిత్ ప్రారంభించా రు. భగవాన్ ధన్వంతరి విగ్రహానికి జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో ఔషధ మొక్కల ప్రాధాన్యత గురుంచి మరియు వంట ఇంట్లో లభించే వస్తువుల ప్రాముఖ్యత గురుంచి క్లుప్తము గా వివరించారు. మారుతున్న జీవన శైలిలో ఆయుర్వేద ప్రాముఖ్యత గురుంచి వివరించారు, డీఎంహెచ్‌వో మాట్లాడుతూ రోజు రోజుకు ఆయుర్వేదానికి, యోగ కు ప్రాధాన్యత పెరిగిందని తెలిపారు. క్యాంపు జిల్లా ఆయుష్ విభాగం ఇన్చార్జి డాక్టర్ జె.గంగాదాస్ మాట్లాడుతూ ధన్వంతరి జయంతి సందర్భంగా ఉచిత ఆయుర్వేద శిబిరం, రక్త పరీక్షలు, షుగర్, బీపీ ఉన్నవారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో సుమారు 246 మంది పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరంలో ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ప్రేమలత, మమత, లలిత, జ్యోత్స్న, వెంకటేష్, జయప్రకాష్ తిరుపతి, ఆయుష్ డిపిఎం వందన రెడ్డి, ఆయుష్ విభాగం ఫార్మసిస్టులు న్యవనండి పురుషోతం, వరలక్ష్మి, స్వరూప, జయరాజ, ఉమా ప్రసాద్ మురళి, నీరజ, పారామెడికల్ సిబ్బంది రమేష్, సురేందర్, మహేష్ భిక్షపతి, పద్మ, రాజేశ్వర్, లావణ్య, వివేకానంద యోగ కేంద్రం అధ్యక్షుడు ఇంద్రకరణ్ రెడ్డి, యోగ ప్రభాకర్, యోగ కిషన్, హన్మాండ్లు, మాజీ ఎంపీటీసీ, యువ నాయకుడు ప్రీతం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సీపీని కలసిన ఎస్సీ, ఎస్టీ కోర్టు పీపీ దయాకర్



సీపీని కలసిన పీపీ

నిజామాబాద్‌లీగల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి):జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు పీపీ దయాకర్ సోమవారం నాడు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సీపీసాయిచైతన్యని మంగళవారంనాడు మర్యాద పూర్వకంగా కలసిన అనంతరం సీపీ శుభాకాంక్షలు తెలుపుతూ..ఈ సందర్భంగా అయనా మాట్లాడుతూ..జిల్లాలో ఉన్న ఎస్సీఎస్టీ కేసులను త్వరిగతిన విచారణ చేయాలని అన్నారు.

నగరంలో భారీ వర్షం

- ఉదయం ఉక్కపోత, సాయంత్రం వర్షంతో ప్రజల ఉక్కిరి బిక్కిరి



ప్రగతి ఆసుపత్రి వద్ద చేరిన వర్షపు నీరు

సుభాష్‌నగర్,సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):నగరంలో ఉద యం ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోగా సాయంత్రం ఒక్క సారిగా భారీ వర్షం కురిసింది. సుమారు గంట పాటు వర్షం కురవడంతో నగర ప్ర జలు ఊ పిరి పీల్చుకున్నారు. గతకొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు ఎక్కు వగా ఉండటంతో ఉక్కపోతతో నగర ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం భారీవర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. నగరంలోని పాతఆర్‌డీవో కార్యాల యం రోడ్డుపై మురికి నీరు ప్రవ హించడంతో అటుగా వచ్చే వాహనదారులకు తీవ్ర ఇబ్బం దులు పడ్డారు. కొద్దిసేపు మురికి నీరంతా రోడ్లపై పారడంతో రాకపో కలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ప్రగతి ఆసుపత్రి వద్ద వర్షం నీరు చేరడంతో అటుగా వెళ్లే వాహన దారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు.

నగరంలో భారీ చోరీ

- సుమారు 30 తులాల బంగారం అపహరణ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సుభాష్‌నగర్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ నగరంలోని నాగారంలో భారీ చోరీ జరిగింది. సుమారు 30 తులాల మేరకు బంగారు ఆభరణాలు దుండగులు ఎత్తికెళ్లారు. నాగారంలోని బ్రాహ్మణ కాలనీలోని నివా సం ఉండే పవన్ శర్మ సోమవా రం రాత్రి ఇంటికి తాళం వేసి పూ జకు వెళ్లాడు. దీంతో గుర్తు తెలియని ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి లాకర్‌ను ధ్వంసం చేశా రు. లాకర్‌లో ఉన్న సుమారు 30 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఐదో టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నూతన హంగులతో రైల్వేస్టేషన్

సుభాష్‌నగర్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రైల్వేస్టేషన్‌ను నూతన హంగులను జోడించి పునరుద్ధరిస్తున్నామని ఎంపీ అర్వింద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌ను మంగళవారం పరిశీలించారు. మొదటగా రైల్వేస్టేషన్ ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం రైల్వేస్టేషన్‌లో కలియ తిరుగుతూ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ పథకం కింద రైల్వే ఆధునీకరణ పనులు జరుగుతున్నాయన్నారు. అదనంగా రైల్వేస్టేషన్‌లో రెండు లైన్‌లు, రెండు ప్లాట్‌ఫామ్‌లు పెరుగుతాయని అన్నారు. కొత్త రైళ్ల రాకపోకలు సాగనున్నాయన్నారు. రైల్వేస్టేషన్‌లో అధునాత ఎస్కలేటర్‌ను, టాయిలెట్లు వస్తాయన్నారు. రైల్వేస్టేషన్ ఎదుట పార్కింగ్‌తో పాటు సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఎంపీ అర్వింద్ వెంట ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పసుపు బోర్డు జాతీయ చైర్మన్ పల్లె గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల వారికి తగ్గిన జీఎస్టీతో లాభం..

దేశంలో అన్ని వర్గాల ప్రజలకు తగ్గిన జీఎస్టీతో లాభం చేకూరుతుందని ఎంపీ అర్వింద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పంచవటి సూపర్‌మార్కెట్, హీరో హోండా షోరూంను మంగళవారం సందర్శించారు. అక్కడ ఉన్న షాపు యజమానులు, వినియోగదారులతో జీఎస్టీ వల్ల కలుగుతున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు.

ఆర్అండ్‌బీ చీఫ్‌ను కలిసిన గిరిజన నాయకులు



మోహన్ నాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు

ధర్పల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆర్అండ్‌బీ ఇంజనీరింగ్ చీఫ్ మోహన్ నాయక్‌ను మంగళవారం ఆల్ ఇండియా బంజారా సేవా జిల్లా గౌరవ అధ్యక్షుడు మోహన్ నాయక్ ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బీ చీఫ్‌ను శాలువా పుష్పగుచ్చంతో సన్మానించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో బంజారా సేవా సంఘానికి రూ.50లక్షలు మంజూరు చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు. బంజారాలు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సందర్భంగా ఆయన దృష్టికి తెచ్చారు. తాండాలో ఆర్అండ్‌బీ రోడ్లతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బీ చీఫ్ మోహన్ నాయక్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు స్వామినాయక్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ నాయక్, బాబునాయక్, పీర్యనాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన కొండాపూర్‌వాసి

సిరికొండ, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి):సిరికొండ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన బాదావత్ జైపాల్ ఇటీవల ఎంబీబీఎస్ సీటు సాధించడంపై గ్రామస్థులు అభినందించారు. ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోయిన తన ప్రతిభతో పట్టుదలతో సీటు సాధించడంతో గ్రామస్తులు అభినందనలు తెలి పారు.

సినిమా గైడ్

దేవి : భద్రకాళి (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : మిరాయి (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : జాలీఎల్ఎల్‌బి-3 (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్ : కిష్కిందపూరి (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్ర్కీన్-1 : ఇలాంటి సినిమా మీరెప్పుడు చూసుండరు (11.00)
: మిరాయి (1.35, 4.35, 7.35, 10.35)
స్ర్కీన్-2 : భద్రకాళి (10.50)
: కిష్కిందపూరి (1.40, 7.30)
: జాలీఎల్ఎల్‌బీ-3 (హిందీ) (4.30, 10.30)
స్ర్కీన్-3 : మిరాయి (11.00)
: జాలీఎల్ఎల్‌బీ-3 (హిందీ) (1.55)
: లిటిల్ హార్ట్స్ (4.45) : భద్రకాళి (7.30) :మత్తు రా (10.30)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్ర్కీన్-1 : జాలీ ఎల్ఎల్‌బీ-3 (హిందీ) (10.00)
: మిరాయి (1.15, 7.25, 10.50)
: కిష్కిందపూరి (4.40)
స్ర్కీన్-2 : మిరాయి (10.10, 4.05)
: ఇలాంటి సినిమా మీరెప్పుడు చూసుండరు (1.35)
: జాలీ ఎల్ఎల్‌బీ-3 (హిందీ) (7.30, 10.40)
స్ర్కీన్-3 : లిటిల్ హార్ట్స్ (12.45, 7.55)
: డెమన్ స్లయర్ (ఇంగ్లీష్) (3.30) : బ్యూటీ (10.40)
స్ర్కీన్-4 : టన్నెల్ (10.50) : దక్ష (1.40)
: జాలీ ఎల్ఎల్‌బీ-3 (హిందీ) (4.00)
: భద్రకాళి (7.15) : కిష్కిందపూరి (10.35)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,19,300	రూ.1,01,100	రూ.1425

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.170	రూ.260	రూ. 280
వెన్‌కాబ్(కిలో)	రూ.175	రూ.265	రూ. 285

